VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A, New Zealand)
1-10-3, Ashok Nagar, Hyderabad-20. INDIA
91(40) 27628104, 27674037
victoria.ashoknagar@gmail.com
//www.victoriaoverseas.com
AAERI
QEAC No. E334

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 08, పేజీలు - 08
గురువారం, జులై 2, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్
ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక
HYDERABAD

- Host On Your Domain
- Hosting / Admin Panel
- Page Builder / Social Links
- Responsive Design
- Advertisement Spaces
- Search Engine Optimization
- XML Sitemap
- Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

# ఏఐతో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్

## - అనలాగ్, మేఘా సంస్థలతో ప్రభుత్వం కీలక ఒప్పందం!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయి కోగ్నిటివ్ సి గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. నెక్స్ట్ జనరేషన్ ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పట్టణ పరిష్కారాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం, ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ సంస్థ అనలాగ్, మౌలిక సదుపాయాల దిగ్గజం మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థల మధ్య ఒక కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమక్షంలో, అనలాగ్ వ్యవస్థాపకుడు , సీఈఓ అలెక్స్ కిప్‌మన్, ఎంఈఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పి. కృష్ణా రెడ్డిల ఉన్నత స్థాయి సమావేశం అనంతరం ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. తెలంగాణలో సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడమే ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశం.

### హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్ట్

ఈ సమావేశంలో అనలాగ్, మేఘా సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రతిపాదిత హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్ట్ బ్లూప్రింట్‌ను వివరించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నగరంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, సిటీ మేనేజ్‌మెంట్‌ను సులభతరం చేయడంపై ఈ ప్రాజెక్ట్ దృష్టి సారించనుంది. సెన్సార్లు, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలయికతో మరింత సురక్షితమైన, స్మార్ట్ , స్పందించే పట్టణ మౌలిక సదుపాయాలను ఎలా సృష్టించవచ్చో కంపెనీలు ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించాయి. ప్రస్తుతం అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్తంగా చేపడుతున్న పలు ప్రాజెక్టుల పురోగతిపై కూడా ఈ సందర్భంగా చర్చించారు.

2లో..

# విజయ్ సర్కారుపై కుట్ర

## - తమిళ రాజకీయాల్లో సంచలనం

- విజయ్ సర్కారును కూల్చే కుట్ర భగ్నం
- 15 మంది టీవీకే ఎమ్మెల్యేలతో ఓ కన్సెల్టెన్సీ సంప్రదింపులు
- డీఎంకే సీనియర్ నేత సెంథిల్ బాలాజీపై టీవీకే ఆరోపణలు



**చెన్నై (ప్రశ్న న్యూస్)**తమిళనాడు రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. దళపతి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం సర్కారును కూల్చేందుకు చేసిన కుట్రను తమిళనాడు నిఘా, పోలీస్ యంత్రాంగం భగ్నం చేసింది. టీవీకేకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలతో బేరసారాలు సాగించి, వారిని ప్రలోభపెట్టిన ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ ఉన్నతాధికారితో పాటు ముగ్గుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు 15 మంది టీవీకే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించడానికి కుట్ర జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. టీవీకే ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టి ఓ కన్సల్టెన్సీ సంస్థ ఉద్యోగిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో డీఎంకే ఎమ్మెల్యే, మాజీ

2లో..

# కవిత పార్టీ పేరుపై అభ్యంతరాల వెల్లువ

## - కేంద్ర ఎన్నికల సంఘానికి దాదాపు 700 ఫిర్యాదులు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కల్వకుంట్ల కవిత స్థాపించిన నూతన రాజకీయ పార్టీ పేరుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఆమె ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పేరుపై కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) దాదాపు 600 నుంచి 700 వరకు అభ్యంతరాలు అందాయి.

2లో..

## తెలుగువారిని అందలం ఎక్కించటమే

# కూటమి లక్ష్యం

- పొదుపులో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శమన్న ముఖ్యమంత్రి
- నేరస్థులకు వంతపాడే రాజకీయ పార్టీలు మనకెందుకు వ్యాఖ్య
- సైకో సహకారంతోనే గొడ్డలి పార్టీ నేతల మాటలు, చేతలు అని ఆగ్రహం
- మావిగన్ అన్న వ్యక్తులు రాజధానికి రౌడీల్లా దండయాత్రలు చేస్తున్నారన్న సీఎం



అమరావతి (ప్రశ్న న్యూస్) పేదలకు అండగా ఉంటూ సంక్షేమం అందిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. పేదరిక నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలునిచ్చారు. నెల్లూరు జిల్లా పున్నపువారిపాలెం ప్రజావేదిక సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. పేదవారందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తాం. డ్వాక్రా సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలి. అందరికీ సంక్షేమ ఫలాలు అందాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి కావాలి. పారిశ్రామిక అభివృద్ధిలో ఏపీ చాలా ముందుంది. దేశంలోనే మెగా ఫర్నిచర్ పార్క్ గూడూరులో వస్తోంది. 10 వేల మందికి ఉపాధి కల్పించబోతున్నాం. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. ఒకప్పుడు పెట్టుబడిదారులు పారిపోయారు. ఇప్పుడు రాష్ట్రాన్ని వెతుక్కుంటూ వస్తున్నారు. నమ్మకం

2లో..

# ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు

- సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలు
- 25లోగా జీతాల బిల్లులు సమర్పించాలని ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగుల్లో ఆనందం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పింది. ఇకపై రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా ప్రతి నెల 1వ తేదీనే ఠంఛనుగా జీతాలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఆర్థిక శాఖ ఈ నెల నుంచే కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, యూనివర్సిటీలు, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఉపశమనం కలిగింది. ఈ నేపథ్యంలోనే వారి అకౌంట్లలో జూలై 1వ తేదీనే జీతాలు జమ చేసినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. గతంలో జీతాలు ఆలస్యంగా రావడంతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే నిర్ణీత తేదీన జీతాలు పొందేలా

2లో..

# ఆధారాలు లేని ఆరోపణలు సహించం



## - సోషల్ మీడియాలో విమర్శలపై పవన్ సీరియస్

- వాక్ స్వాతంత్రన్ని దుర్వినియోగం చేయొద్దని పవన్ హెచ్చరిక
- డిప్యూటీ సీఎంవోలో స్పెషల్ టాస్క్ ఫోర్స్
- ఆధారాలతో ఫిర్యాదు చేస్తే బీఎన్ఎస్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు

**అమరావతి (ప్రశ్న న్యూస్)**సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. ఇలాంటి నేరాలకు పాల్పడితే బీఎన్ఎస్ చట్టాల ప్రకారం శిక్షిస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా వీడియో సందేశం విడుదల చేశారు. "వాక్ స్వాతంత్రన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛ అనేది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు.

2లో..

# నిరుద్యోగ హైదరాబాద్

- నిరుద్యోగంలో బెంగళూరును మించిన హైదరాబాద్
- 10 లక్షల మందిలో 68 వేల మంది నిరుద్యోగులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశంలో ఐటీ, స్టార్టప్‌లు, అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్‌లో నిరుద్యోగం ఆందోళనకర స్థాయికి చేరింది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన తొలి

2లో..

## పార్లమెంట్ సమావేశాల్లో

# 'పీఎం/సీఎం తొలగింపు' బిల్లు?

### ప్రాంతీయ పార్టీల మద్దతు బిల్లు భవితవ్యాన్ని నిర్ణయించే అవకాశం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల పదవులకు సంబంధించి కీలక రాజ్యాంగ సవరణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. 130వ రాజ్యాంగ సవరణ బిల్లును రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. అవినీతి వంటి తీవ్రమైన కేసుల్లో ప్రధాని లేదా సీఎం అరెస్టై 30 రోజులకు పైగా జైలులో ఉంటే వారి పదవిని రద్దు చేయాలన్నదే

2లో..

## కాంగ్రెస్‌లో కొత్తవాళ్లదే రాజ్యం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ

2లో..

## వచ్చే ఎన్నికలు

# 'మావిగన్ వర్సెస్ అమరావతి'

## - వైఎస్ జగన్ సంచలన ప్రకటన

- తాము మావిగన్ కు కట్టుబడి ఉన్నామన్న జగన్
- మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని వ్యాఖ్య
- ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టీకరణ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో సరికొత్త అజెండాను ప్రకటించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన

2లో..

# పాలనపై చర్చకు సిద్ధం.. తేదీ చెప్పండి



## - సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత పాలన, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఆయన ప్రకటించారు. ఈ చర్చకు సంబంధించిన తేదీ, సమయాన్ని ఖరారు చేయాలని ఆయన ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గడువులో సగం కాలం పూర్తయినా, చెప్పుకోవడానికి ఒక్క విజయం కూడా లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వరి సాగు 2014-15 నాటికి ఉన్న 26 లక్షల హెక్టార్ల నుంచి, పాలన ముగిసే సమయానికి 59 లక్షల హెక్టార్లకు పెరిగిందని గుర్తు చేశారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి గత ప్రభుత్వంపై నిందలు వేస్తోందని

2లో..

# ఏఐతో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్

### ఏఐ అడాప్టివ్ సిగ్నల్స్.. అంబులెన్స్‌లకు గ్రీన్ ఛానల్ ప్రాధాన్యత!

ఈ నెక్స్ట్ జనరేషన్ కోగ్నిటివ్ సిటీస్ కాన్సెప్ట్‌లో భాగంగా పలు అద్భుతమైన ఫీచర్లను ముఖ్యమంత్రికి వివరించారు. అందులో ముఖ్యంగా ఏఐ-ఎనేబుల్డ్ అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్స్, రియల్ టైమ్ ట్రాఫిక్ జామ్‌ల తక్షణ నియంత్రణ , పైప్‌లైన్లలో నీటి లీకేజీలను ముందే గుర్తించే సాంకేతికత, స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఫైర్ సర్వీస్ వాహనాలకు ట్రాఫిక్ చిక్కులు లేకుండా ప్రాధాన్యత మార్గాలను కేటాయించే వ్యవస్థను ఇందులో పొందుపరిచారు. డేటా ఆధారిత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్ ద్వారా పారదర్శకమైన పాలనను అందించవచ్చని, పౌర సేవలను మరింత వేగవంతం చేయవచ్చని కంపెనీలు స్పష్టం చేశాయి.

### వాతావరణాన్ని బట్టి మారే సిగ్నల్ టైమింగ్స్!

కంపెనీల ప్రజెంటేషన్‌పై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. హైదరాబాద్ నగరంలోని అన్ని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఒకే గొడుగు కిందికి తెస్తూ యూనిఫైడ్ ఇంటెలిజెంట్ సిస్టమ్‌గా అనుసంధానించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడైనా ట్రాఫిక్ రద్దీ పెరిగినా, లేదా వర్షం వంటి వాతావరణ పరిస్థితులు మారినా దానికి అనుగుణంగా సిగ్నల్ టైమింగ్స్ స్వయంచాలకంగా మారిపోయేలా ఏఐ ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దీనివల్ల నగరవాసులకు ప్రయాణ సమయం కలిసిరావడంతో పాటు కాలుష్యం కూడా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### విశ్వనగరంగా హైదరాబాద్‌కు నయా హంగులు!

ఈ అవగాహన ఒప్పందం కేవలం ట్రాఫిక్ నియంత్రణకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే ఒక మైలురాయిగా నిలవనుంది. అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అనలాగ్ సంస్థ, ప్రాజెక్టుల నిర్మాణంలో అపార అనుభవం ఉన్న మేఘా సంస్థలు చేతులు కలపడం వల్ల ఈ ఐటీ హబ్ మరింత బలోపేతం కానుంది. భౌతిక మౌలిక సదుపాయాలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను జోడించడం ద్వారా గ్లోబల్ డిజిటల్ సిటీల సరసన హైదరాబాద్ నిలవడానికి ఈ సరికొత్త ప్రాజెక్ట్ ఎంతగానో దోహదపడనుంది.

# విజయ్ సర్కారుపై కుట్ర

మంత్రి సెంథిల్ బాలాజీకి సంబంధాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. చెన్నైలో ఒకర్ని అరెస్టు చేయగా, మిగతా ఇద్దరిని కరూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. కుట్ర, దాని విస్తృత నెట్‌వర్క్‌పై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఉత్తంగరై టీవీకే ఎమ్మెల్యే ఎన్ ఎలయరాజా చెన్నై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా కన్సల్టెన్సీ సంస్థ ఐపీడీఎస్‌కు చెందిన ఓ వ్యక్తి తనకు రూ.35 కోట్లు ఇచ్చారని ఆయన ఆరోపించారు. తర్వాత తనను బెదిరించారని, దీనిపై ఎవరితోనూ చర్చించవద్దని చెప్పారని ఎమ్మెల్యే ఆరోపించారు.

అరెస్టైన ముగ్గురిలో ఒకరు సెంథిల్ బాలాజీ, అతడి సోదరుడు అశోక్‌కు సన్నిహితుడని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామానికి ముందు డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ మాట్లాడుతూ "త్వరలోనే టీవీకే ప్రభుత్వం కూలిపోతుందని, తమిళనాడులో ముందస్తు ఎన్నికలు రావడం ఖాయం" అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. డీఎంకే వ్యూహాత్మకంగానే విజయ్ ప్రభుత్వంపై కుట్రకు తెరలేపిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై అధికార టీవీకే, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్‌కుమార్ డీఎంకేపై విరుచుకుపడ్డారు. "సెంథిల్ బాలాజీతో నేరుగా సంబంధం ఉన్న వ్యక్తులు, అలాగే 'కరూర్ గ్యాంగ్'కు ఇందులో ప్రత్యక్ష పాత్ర ఉంది, పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.. ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్టు చేయాలి. ఇలాంటి నీచ కార్యకలాపాలకు ముగింపు పలకాలి"అని కుమార్ అన్నారు. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామితో డీఎంకే కుమ్మక్కయ్యిందని మంత్రి ఆరోపించారు. పలువురు టీవీకే ఎమ్మెల్యేలకు ఫిరాయింపుల కోసం డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. "ఈపీఎస్ తదితరులు దొంగదారిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు ఈరోజు దాని స్వరూపాన్ని మనం చూస్తున్నాం. ఎంకే స్టాలిన్, ఉదయనిధి ఆదేశాల మేరకు సెంథిల్ బాలాజీ వంటి డీఎంకే కీలక వ్యక్తులు మా ఎమ్మెల్యేలను సంప్రదిస్తున్నారు. వారికి రూ.10 కోట్లు, 20 కోట్లు ఇస్తామని ఆఫర్ చేశారు" అని మంత్రి కుమార్ మండిపడ్డారు.

## తెలుగువారిని అందలం ఎక్కించటమే

# కూటమి లక్ష్యం

కలిగించినందుకే రాష్ట్రానికి క్యూ కడుతున్నారు" అని చంద్రబాబు అన్నారు.

### గొడ్డలి పార్టీ నెవర్ అగైన్

'గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని, జీవితంలో ఆ పార్టీ మళ్లీ గెలవకూడదని, ఎన్డీయే ప్రభుత్వమే అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేరాలు చేయడం రాజకీయ పార్టీలకు తగదని, నేరస్థుల పార్టీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో పార్టీలను చూశానని, నేరాలు చేసే పార్టీని, నేరస్థులను కాపాడే పార్టీని చరిత్రలో మొదటిసారి ఇప్పుడే చూస్తున్నానని మండిపడ్డారు. అర్హత లేనివాళ్లకు అందలం ఎక్కిస్తే చాలా సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అవుతుందని మరోసారి హెచ్చరించారు. హోంమంత్రి అనితపై అసభ్య వ్యాఖ్యలను తప్పుబట్టారు. గొడ్డలి పార్టీ నేత సతీమణిపై పోస్టు పెడితే వెంటనే అరెస్టు చేశామని, ఆడవాళ్లపై నోరు పారేసుకున్న ఎవరినీ వదిలిపెట్టబోమని తేల్చి చెప్పారు.

### గతంలో మానసిక క్షోభ అనుభవించా

విజయవాడలో ఒక వ్యక్తి అదృశ్యమయ్యారని, ఆయనను అరెస్టు చేసిన తర్వాతే మిస్ అయ్యాడని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ విషయం తన దృష్టికి రాగానే సిట్ వేసి దర్యాప్తు ప్రారంభించామని, తప్పు చేసింది పోలీసులైనా సరే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించానని చెప్పారు. అయితే, ఈ వ్యవహారానికి కొందరు కుల ముద్ర వేసి విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టారని, అసలు ఇలాంటి అసభ్యకర పోస్టులతో ఏం సాధించాలని అనుకుంటున్నారని చంద్రబాబు ప్రశ్నించారు. గతంలో తన భార్యను అసెంబ్లీ సాక్షిగా దూషిస్తే, తాము ఎంతో మానసిక క్షోభ అనుభవించామని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు ఏకంగా డిప్యూటీ సీఎం కుమార్తెలపై కూడా నీచమైన పోస్టులు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రాష్ట్ర పునర్నిర్మాణానికి నేను, పవన్ ముందుకొచ్చాం

గొడ్డలి పార్టీ కులమతాల మధ్య చిచ్చుపెడుతూ అమరావతిపై దుష్ప్రచారం చేస్తోందని, గత ఐదేళ్లలో మూడు ముక్కలాట తప్ప ఏమీ చేయలేదని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. భవిష్యత్తులో అన్ని ఏసీ బస్సులే నడుపుతామన్నారు. లబ్ధిదారులు ఏదైనా ఒక నెలలో తీసుకోకపోయినా, మూడు నెలల పింఛన్ ఒకేసారి ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి తాను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి ముందుకొచ్చామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, సుపరిపాలనకు నాంది పలికామని హర్షం వ్యక్తం చేశారు. 'మన మిత్ర' యాప్‌లోనే అన్ని ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచామని, 62.20 లక్షల మంది కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. తాను ఇంట్లో కూర్చుని బటన్ నొక్కేవాణ్ని కాదని, ప్రజల్లో ఉండే వ్యక్తినన్నారు. 28 కేటగిరీల వారికి పండుగ వాతావరణంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని స్పష్టం చేశారు.

### "సంజీవని ప్రాజెక్టు" తీసుకువస్తున్నాం

రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి 'సంజీవని ప్రాజెక్టు' తీసుకువస్తున్నామని, రాబోయే రోజుల్లో ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గంజాయికి ఆంధ్రప్రదేశ్‌లో అస్సలు చోటు లేదని, రాష్ట్రాన్ని పూర్తిగా డ్రగ్ రహితంగా తయారుచేస్తామని స్పష్టం చేశారు. విద్యా రంగంలో మార్పులు వస్తున్నాయని, ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ బడుల్లోకి విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

# కవిత పార్టీ పేరుపై అభ్యంతరాల వెల్లువ

ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ అభ్యంతరాలను ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు వ్యక్తం చేశారు. గతంలో 'తెలంగాణ రాష్ట్ర సమితి'గా ఉన్న తమ పార్టీ పేరును ఇది పోలి ఉండటం వల్ల ప్రజల్లో గందరగోళం తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు అభ్యంతరాలపై కవిత పార్టీ ప్రతినిధులు ఈసీకి వివరణ ఇచ్చారని, మిగిలిన వాటికి కూడా సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం.తెలంగాణ ఉద్యమంలో 'టీఆర్ఎస్' కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. 2026 ఏప్రిల్ నెలాఖరులో కవిత తన నూతన పార్టీని ప్రకటించిన సమయంలో, ఈ పేరుపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. అనంతరం, ఈసీఐ అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు ఇచ్చింది. జూన్ నెలలో బీఆర్ఎస్ పార్టీ అధికారికంగా అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు, సోలాపూర్‌కు చెందిన మరో సంస్థ కూడా ఇదే తరహా పేరు కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఈ ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం అందిన అన్ని అభ్యంతరాలను, వాటికి లభించిన వివరణలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రాజకీయ పార్టీల పేర్లు, గుర్తుల నిబంధనలకు అనుగుణంగా, ఓటర్లలో ఎలాంటి అయోమయం లేకుండా చూసేందుకు సమీక్ష నిర్వహించిన తర్వాతే ఈసీ తన తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది.

# వచ్చే ఎన్నికలు 'మావిగన్ వర్సెస్ అమరావతి'

ఈ సమావేశంలో ఆయన ఏపీ రాజధానిగా చంద్రబాబు ప్రతిపాదిస్తున్న అమరావతిని మరోసారి తిరస్కరించారు. తాము తెచ్చి మావిగన్ కారిడార్ అభివృద్ధి ప్రతిపాదనకే తమ పార్టీ సంపూర్ణంగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల సమరం ప్రధానంగా మావిగన్ వర్సెస్ అమరావతి మధ్యే ఉంటుందని, ఈ రెండు రాజధాని నమూనాలలో ప్రజల మద్దతు దేనికి ఉందో వచ్చే ఎన్నికల్లోనే తేలిపోతుందని జగన్ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ మావిగన్ కారిడార్ ప్రతిపాదనను అధికారికంగా చేరుస్తామని ఆయన వెల్లడించారు.

### నేను అమరావతికి వ్యతిరేకం కాదు.. బాబు స్కామ్‌లనే ప్రశ్నిస్తున్నా!

'జగన్ అమరావతికి వ్యతిరేకం' అంటూ కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్ జగన్ మండిపడ్డారు. తాను అమరావతి ప్రాంతానికి గానీ, అక్కడి రైతులకు గానీ వ్యతిరేకం కాదని క్లారిటీ ఇచ్చారు. అమరావతి పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు సాగిస్తున్న వేల కోట్ల రూపాయల రియల్ ఎస్టేట్ స్కామ్‌లను, అవినీతిని మాత్రమే తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. శూన్యం నుండి అమరావతిని నిర్మించడానికి లక్షల కోట్లు ఖర్చు చేయడం రాష్ట్ర భవిష్యత్తును భ్రమల్లో నెట్టడమేనని విమర్శించారు. దానికి బదులుగా ఇప్పటికే ఎయిర్‌పోర్ట్, పోర్టు, జాతీయ రహదారుల వంటి మౌలిక సదుపాయాలు ఉన్న 110 కిలోమీటర్ల 'మావిగన్' ప్రాంతాన్ని రాజధాని కారిడార్‌గా మార్చడమే అత్యంత ఆచరణాత్మకమైన పరిష్కారమని, అవినీతి లేని రాజధాని కావాలనేదే తన ఆకాంక్ష అని జగన్ వివరించారు.

### ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్ర.. చివరికి సిటిజన్‌షిప్ లేకుండా చేస్తారా?

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం 'ఎస్ఐఆర్' పేరుతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లను వ్యవస్థాగతంగా తొలగించే పెద్ద కుట్ర చేస్తోందన్నారు. ఓట్లను తొలగిస్తే భవిష్యత్తులో ప్రజలకు సంక్షేమ పథకాలు ఎలా వస్తాయి? అసలు ఓట్లు తీసేసి చివరికి ఈ రాష్ట్రంలో పౌరులకు సిటిజన్‌షిప్ కూడా లేకుండా చేస్తారా?" అని జగన్ నిలదీశారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇవ్వకుండానే, ఇచ్చినట్లు రాయాలంటూ చంద్రబాబు అధికారులను ఆదేశిస్తున్నారని, ప్రతి పోలింగ్ బూత్‌లో 40 నుండి 50 వైసీపీ ఓట్లను తొలగించాలని చూస్తున్నారని, దీనిపై తమ క్యాడర్ గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు.

### రైతాంగం రోడ్డున పడింది.. మూడు బడ్జెట్లు పెట్టినా ధరల స్థిరీకరణ శూన్యం!

రాష్ట్రంలోని ఆర్థిక, వ్యవసాయ పరిస్థితులపై జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో ఏ పంటకూ కనీస గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. అసెంబ్లీలో మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ధరల స్థిరీకరణ నిధికి అరకొర నిధులే కేటాయించారని ఎద్దేవా చేశారు. "రైతులు పంట పండిస్తే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో పొగాకు రైతులు రోడ్డెక్కుతున్నారు, ఆక్వా రైతులు మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మా హయాంలో తెచ్చిన 'అప్సడా' చట్టాన్ని పక్కనబెట్టి ఫీడ్ సిండికేట్లకు బాబు కొమ్ముకాస్తున్నారు" అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మాది సంక్షేమ పాలన.. బాబుది 'రెడ్ బుక్' అరాచక రాజ్యాంగం

తమ ఐదేళ్ల హయాంలో రాష్ట్రంలో నిరంతరం విద్యా, వైద్యం, ఆర్బీకేలు, పేదల సంక్షేమం గురించి చర్చ జరిగేదని కానీ చంద్రబాబు సీఎంగా వచ్చాక రాష్ట్రంలో కేవలం రెడ్ బుక్ రాజ్యాంగం , కస్టోడియల్ డెత్స్ మీదనే చర్చ జరుగుతోందని జగన్ దుయ్యబట్టారు. విజయవాడ పరిధిలో జరిగిన సాయికృష్ణ, క్రాంతికుమార్ మరణాల కేసుల్లో నిజాలను కప్పిపుచ్చడానికి కృష్ణలంక పీఎస్ సీసీటీవీ ఫుటేజీలను డిలీట్ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా పూర్తిగా పక్కకుపోయి, 'రూల్ ఆఫ్ ఫియర్' రాజ్యమేలుతోందని, సాధారణ ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు వచ్చాయని జగన్ ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు చేస్తున్న టాపిక్ డైవర్షన్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

# పాలనపై చర్చకు సిద్ధం.. తేదీ చెప్పండి

కేటీఆర్ ఆరోపించారు. తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ. 3.5 లక్షల కోట్లు మాత్రమేనని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత దారుణంగా ఉంటే ముఖ్యమంత్రి 72 సార్లు ఢిల్లీ పర్యటనలు ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ, ప్రెస్ క్లబ్ లేదా జూబ్లీహిల్స్ ప్యాలెస్ వేదిక ఏదైనా చర్చకు తాను వస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చర్చకు రేవంత్ రెడ్డి లేదా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చినా తనకు అభ్యంతరం లేదన్నారు. "ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా నిరూపించడంలో నేను విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను" అని కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు.

## ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు

# ఒకటో తేదీన జీతాలు

చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల నిర్వహించిన సమీక్షలో అధికారులను ఆదేశించారు. ఆ మేరకు ఆర్థిక శాఖ అన్ని శాఖలకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. తాజాగా విడుదల చేసిన నిబంధనల ప్రకారం ప్రతి నెల 25వ తేదీలోగా సంబంధిత శాఖలు జీతాల బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ విభాగాలకు సమర్పించాల్సి ఉంటుంది. అలాగే నెల చివరి పని దినానికల్లా బిల్లుల పరిశీలన ఆడిట్ ప్రక్రియ పూర్తి చేసి తదుపరి నెల మొదటి తేదీన ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ నెల బిల్లులు సకాలంలో అందిన అన్ని శాఖల ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమ చేసినట్లు ఆర్థిక శాఖ అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక సమర్పించారు. ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీతాల కోసం ప్రతి నెల ఎదురుచూడాల్సిన పరిస్థితి ఇక నుంచి ఉండదని కుటుంబ ఆర్థిక ప్రణాళికలు కూడా సులభతరం అవుతాయని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం లక్షలాది మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భారీ ఊరటనివ్వనుంది.

## ఉపాధి హామీ పథకంలో

# పాత విధానమే అమలు చేయాలి

**తుగ్గలి:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో అమలులో ఉన్న విధానాన్నే కొనసాగించాలని,వీబీజీ రామ్‌జీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తుగ్గలి మండల ఉపాధి హామీ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శ్రీరాములు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాల వల్ల గ్రామీణ పేదలు,ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్న విధంగా పనులు కల్పించడం,కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడం, పనిదినాలను పెంచడం, గ్రామీణ పేదలకు ఉపాధి భద్రత కల్పించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని టెక్నికల్ అసిస్టెంట్ ఫరీదప్ప, చిన్న అంజి,సి.ఓ లకు వారు అందజేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని,లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఆధారాలు లేని ఆరోపణలు సహించం

ఆ హక్కును మేము గౌరవిస్తాం. సోషల్ మీడియా రోజువారీ జీవితంలో భాగమైపోయింది. అభిప్రాయాలు తెలిపేందుకు, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవడానికి, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఇదో శక్తివంతమైన వేదిక. కానీ మనం గుర్తించుకోవాల్సింది ఏమిటంటే భావ ప్రకటనా స్వేచ్ఛ అనేది అపరిమితమైన హక్కు కాదు. దానికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయి. ఒకరి హక్కులను ఉల్లంఘించే స్థాయికి వెళ్లినప్పుడు చట్టపరమైన పరిణామాలు తప్పవు. రాజ్యాంగం ప్రకారం దేశ సమగ్రత, జాతీయ భద్రత, ప్రజాశాంతి, మర్యాద, నైతిక విలువలు, నేరాలకు ప్రోత్సహించటం వంటి అంశాలలో దీనికి పరిమితులు ఉన్నాయి." అని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు."భావ ప్రకటన స్వేచ్ఛ అనేది.. దూషించే హక్కు కాదు. ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు మీకుంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, నిర్ణయాలతో విభేదించే హక్కు మీకు ఉంది. అదే ప్రజాస్వామ్యం. దాన్ని మేము స్వాగతిస్తాం. కానీ ఒకరిని తిట్టడం, చంపుతామని బెదిరించడం, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం, మహిళలను టార్గెట్ చేయడం, మత విశ్వాసాలను అవమానించడం, ఒక వ్యక్తి గౌరవాన్ని దెబ్బతీయడం, హింసకు ప్రేరేపించడం ఇవి రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ కాదు. చట్టపరంగా నేరాలు." అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. "గత కొన్నేళ్లుగా సోషల్ మీడియా దుర్వినియోగం ఆందోళనకర స్థాయికి చేరుకుంది. చాలామంది ఫేక్ అకౌంట్ల వెనుక దాక్కొని అసభ్య పదజాలం ఉపయోగించడం, వ్యక్తిగత దూషణలు చేయడం., ఆధారాలు లేని ఆరోపణలు చేయడం, ఫేక్ ప్రొపగండా, మార్ఫింగ్ ఫోటోలు, బెదిరింపులు, వేధింపులకు పాల్పడుతున్నారు. మహిళలను అసభ్యంగా టార్గెట్ చేసుకుంటున్నారు. చివరకు దేవతలపై కూడా ఉద్దేశపూర్వకంగా అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారు.ఇది ప్రజాస్వామ్యం కానే కాదు. ఈ సందర్భంగా ఓ విషయం స్పష్టం చేస్తున్నా. విమర్శలనేవి నిర్మాణాత్మకంగా ఉండాలి శ్రుతిమించితే శిక్షలు తప్పవు." అని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.నేరస్తులకు, నేరాలకు కులం, మతం, రాజకీయ పార్టీలు ఉండవన్న పవన్ కళ్యాణ్.. తప్పు చేసి వాటి వెనుక దాక్కునే ప్రయత్నం చేయవద్దని సూచించారు. చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేశారు. సోషల్ మీడియా దుర్వినియోగం ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఒకటే చెప్తున్నానన్న పవన్ కళ్యాణ్ వారు ఒంటరి కాదని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. డిప్యూటీ సీఎంవోలో సోషల్ మీడియా దుర్వినియోగంపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు.

# నిరుద్యోగ హైదరాబాద్

నగర స్థాయి కార్మిక మార్కెట్ నివేదిక ప్రకారం హైదరాబాద్‌లో నిరుద్యోగ రేటు ప్రస్తుతం 6.8 శాతంగా నమోదైంది. కోటి జనాభా దాటిన దేశంలోని 46 ప్రధాన నగరాల సగటు నిరుద్యోగ రేటు 4.9 శాతం మాత్రమే ఉండగా ఆ సగటును మించి హైదరాబాద్‌లో నిరుద్యోగం ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఐటీ రంగంలో హైదరాబాద్‌తో పోటీ పడే బెంగళూరులో నిరుద్యోగ రేటు కేవలం 2.8 శాతం మాత్రమే ఉండగా హైదరాబాద్‌లో మాత్రం 6.8 శాతం ఉండటం గమనార్హం. సూరత్‌లో 1 శాతం, హౌరాలో 0.8 శాతం, రాజ్‌కోట్‌లో 0.3 శాతంగా నమోదైంది. మరోవైపు అత్యధిక నిరుద్యోగం పాట్నాలో 20.9 శాతం, ప్రయాగ్‌రాజ్‌లో 15.8 శాతం, ధన్‌బాద్‌లో 15 శాతంగా ఉంది.ఇక హైదరాబాద్‌లో 6.8 శాతం నిరుద్యోగం అంటే ప్రతి 10 లక్షల జనాభాలో దాదాపు 68 వేల మంది ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నట్లు అర్థం అవుతోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో ఈ స్థాయి నిరుద్యోగం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఎన్ఎస్ఓ రిపోర్టులో అత్యంత ఆందోళనకర అంశం మహిళా నిరుద్యోగం. హైదరాబాద్‌లో మహిళల నిరుద్యోగ రేటు 9.1 శాతానికి చేరుకుంది. చదువుకున్నప్పటికీ సరైన అవకాశాలు లేకపోవడం, కుటుంబ బాధ్యతలు, మారుతున్న ఉద్యోగ విధానాలు వంటి కారణాలతో మహిళలు ఉద్యోగ రంగంలో వెనుకబడుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. 15 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయసు ఉన్న యువతలో నిరుద్యోగం అత్యధికంగా 25.1 శాతంగా ఉన్నట్లు వెల్లడైంది. ఉద్యోగం, విద్య, శిక్షణ ఏదీ లేకుండా ఉన్నవారి సంఖ్య 25.1 శాతమని నివేదిక వెల్లడించింది. ఇది దేశ పట్టణాల సగటు (25 శాతం)తో సమానంగా ఉంది. అయితే యువతుల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. మహిళల్లో 37.3 శాతం మంది ఈ వర్గంలో ఉండగా యువకుల్లో ఇది 12.6 శాతం మాత్రమే కావడం గమనార్హం. కోయంబత్తూరు (8.2 శాతం), నవి ముంబై (8.4 శాతం) వంటి నగరాలు ఈ విషయంలో కాస్త మెరుగైన స్థితిలో ఉన్నాయి. నిరుద్యోగం ఎక్కువగా ఉన్నప్పటికీ వేతన ఉద్యోగాల పరంగా హైదరాబాద్ దేశంలోనే బలమైన నగరాల్లో ఒకటిగా నిలిచింది. నగరంలోని ఉద్యోగుల్లో 62.1 శాతం మంది రెగ్యులర్ జీతభత్యాల ఉద్యోగాల్లో పనిచేస్తున్నారు. ఇది దేశంలోని కోటి మందికిపైగా జనాభా కలిగిన నగరాల సగటు 58.5 శాతం కంటే ఎక్కువ. బెంగళూరులో ఈ వాటా 67.4 శాతంగా ఉంది. హైదరాబాద్‌లో రెగ్యులర్ ఉద్యోగుల సగటు నెలవారీ జీతం రూ.31,153గా నమోదైంది. ఇది కోటి మందికిపైగా జనాభా కలిగిన నగరాల సగటు రూ.28,808 కంటే ఎక్కువ. అదే బెంగళూరులో రూ.34,323, నవీ ముంబై రూ.51,515 కంటే తక్కువ అని తేలింది. స్వయం ఉపాధి పొందుతున్న వారి సగటు నెల ఆదాయం రూ.30,075 కాగా రోజువారీ కూలీల సగటు వేతనం రూ.784గా ఉంది. ఒకవైపు కంపెనీలు సరైన నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులు దొరకడం లేదని చెబుతుండగా మరోవైపు లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ స్కిల్ గ్యాప్‌ను తగ్గించేందుకు కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక రంగాల్లో యువత శిక్షణ పొందాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# కాంగ్రెస్‌లో కొత్తవాళ్లదే రాజ్యం

కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలను మరోసారి వెలుగులోకి తీసుకొచ్చాయి. రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యం తగ్గిపోయిందని ఇటీవల పార్టీలో చేరిన కొత్త నాయకులదే ఇప్పుడు హవా నడుస్తోందని విమర్శించారు. తాజాగా ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు నియామకాల విషయంలో తనను పూర్తిగా పక్కన పెట్టారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.తన మునుగోడు నియోజకవర్గం యాదాద్రి భువనగిరి జిల్లాలోనే ఉన్నప్పటికీ ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకంపై తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు.

తాను ఆ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేను అని కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిని అని కనీసం ఒక మాటైనా చెప్పాల్సిందని పేర్కొన్నారు. తనను సంప్రదించి ఉంటే తన మునుగోడు నియోజకవర్గం నుంచి ఒక సభ్యుడిని ట్రస్ట్ బోర్డులోకి సిఫార్సు చేసేవాడిని అని కానీ పూర్తిగా వారే నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని వ్యాఖ్యానించారు.ప్రభుత్వంలో షోఅప్స్ ఎక్కువ అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి వ్యవహార తీరుపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులను ఎలా గౌరవించాలో తెలియాలని ఇలా ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తే కష్టమే అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఇటీవల నల్గొండలో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి సభకు తాను హాజరుకాకపోవడానికి కూడా ఇదే కారణమని రాజగోపాల్ రెడ్డి తేల్చి చెప్పారు. వాళ్ల వ్యవహారశైలి తనకు నచ్చలేదని అందుకే సభకు వెళ్లలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ తాను ముఖ్యమంత్రితో టచ్‌లోనే ఉన్నానని.. రాహుల్ గాంధీని కూడా కలిశానని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నానని చెప్పారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన కొత్తవాళ్లదే ఇప్పుడు హవా అని తెలంగాణ కోసం మొదటి నుంచి పోరాడిన నాయకులు రోజురోజుకూ కనుమరుగవుతున్నారని సీనియర్ నేతలను గౌరవించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో తగ్గిపోతోందటూ తన అసంతృప్తిని వెళ్లగక్కారు. తాజాగా రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలకు తెరలేపాయి.

## పార్లమెంట్ సమావేశాల్లో

# 'పీఎం/సీఎం తొలగింపు' బిల్లు?

ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. గతేడాది ప్రవేశపెట్టిన ఈ బిల్లును ప్రతిపక్షాల డిమాండ్ మేరకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపారు. జేపీసీ నివేదిక సమర్పించిన తర్వాత ప్రభుత్వం దీనిపై ముందుకు వెళ్లే అవకాశముందని సమాచారం. ఈ బిల్లు రాజ్యాంగ సవరణకు సంబంధించినది కావడంతో ప్రత్యేక మెజారిటీ అవసరం. లోక్‌సభ, రాజ్యసభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది మద్దతు తెలపాలి. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 నిబంధనలను కూడా పాటించాల్సి ఉంటుంది.

గతంలో ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దేశ అత్యున్నత ప్రజాప్రతినిధుల పదవులకు సంబంధించిన అంశం కావడంతో మరింత పరిశీలన అవసరమని అప్పట్లో వాదించాయి. గతేడాదితో పోలిస్తే పార్లమెంట్‌లో ఎన్డీయే బలం పెరిగింది. అయినప్పటికీ రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడొంతుల మెజారిటీ మాత్రం ఇంకా లేదు. అందుకే బీజేడీ, వైఎస్సార్‌సీపీ వంటి ప్రాంతీయ పార్టీల మద్దతు కీలకంగా మారే అవకాశం ఉంది. ఈ బిల్లుకు అవి మద్దతు ఇస్తాయా లేదా అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వాటి నిర్ణయంపైనే బిల్లు భవితవ్యం ఆధారపడే అవకాశముంది.

# సమాజంలో వైద్యుల సేవలు అమూల్యం

- మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు
- డాక్టర్ మధు మహేష్
- డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులకు మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఘన సన్మానం



వేములవాడ (ప్రశ్న న్యూస్) "జాతీయ డాక్టర్స్ డే" సందర్భంగా సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు వైద్యులను "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. వైద్య సేవలను గుర్తిస్తూ శాలువాలు కప్పి డాక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సమయానుకూలంగా చికిత్స అందించి ప్రాణాలను కాపాడే వైద్యులు నిజమైన ప్రాణదాతలని అన్నారు. రాత్రింబవళ్లు సేవలందిస్తూ సమాజ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న వైద్యుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ప్రఖ్యాత వైద్యుడు,పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది జూలై 1న 'డాక్టర్స్ డే' నిర్వహిస్తున్న నేపథ్యంలో, వైద్యుల సేవలను గౌరవిస్తూ ఈ సన్మాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, నిర్వాహకులు మధు మహేష్, ట్రస్ట్ సభ్యులు పసుల శ్రీధర్, అన్నం నర్సయ్య, మఠం శివకుమార్ తదితరులు పాల్గొని వైద్యులకు అభినందనలు తెలిపారు.

# ప్రత్యామ్నాయ పంటలతో అధిక లాభాలు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రామాయంపేట మండల కేంద్రంలో రైతులు శీలం బాల్ రెడ్డి , శీలం వెంకట్ పొలంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి ప్రతాప్ సింగ్ రామాయంపేట, నిజాంపేట్ వ్యవసాయ అధికారరులు, ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, లివ్ పామ్ రిసోర్సెస్ కంపెనీ మేనేజర్ , ప్రతినిధిధులు, మైక్రో ఇరిగేషన్ ప్రతినిధులు, రైతులు , తదితరులు పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమాన్నీ ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులందరూ డిమాండ్ ఉన్న పంటలపై మొగ్గు చూపాలని, అందులో ఆయిల్ పామ్ పంట దేశంలో ఎ పంటకి లేనివిధంగా చట్టం ద్వారా ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం ఉందన్నారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపట్టు రైతులకు మొక్కలపై రాయితితో పాటు నాలుగు సంవత్సరములు తోట నిర్వహణ , అంతర పంటల సాగు కొరకు రాయితీ సొమ్మును రైతుల ఖాతాకు జమ చేయబడునన్నారు. ఒక రైతుకు గరిష్టంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్ పరికరాల పై రాయితీ సదుపాయం కల్పించబడునని,ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరముల తరువాత ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి వచ్చుఅన్నారు. ప్రస్తుతం ఒక్క టన్ను ఆయిల్ పామ్ గెల ధర రూ. 23,852 /-. ఈ లెక్కన సంవత్సరమునకు రూ. 2,38,520/- ఆదాయం వచ్చు అని ,ఖర్చులు పోను ఒక ఎకరానికి సంవత్సరమునకు రూ. 2,00,000/- పొందవచ్చు. అని తెలిపారు. రైతులు తమ ఆయిల్ పామ్ ఉత్పత్తులను ఫ్యాక్టరీ వరకు రవాణా చేసుకొనుటకు అధిక ఛార్జీలు కేటాయించవలసి రావడం వలన కంపనీ వారు రైతులకు ఇబ్బంది కలుగకుండా ప్రతి 15 నుంచి లకు ఒక కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.కంపనీ వారు గెలలను కొనుగోలు చేసిన తరువాత నియమ నిబంధనల ప్రకారం 14 రోజులలోపు రైతు ఖతాకు డబ్బు జమ చేయబడుతుందనీ తెలిపారు.వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని, దీని వలన రెట్టింపు ఆదాయం పొందవచ్చని, ఒక ఎకరా వరి వేసే నీళ్ళతో 5 ఎకరాల ఆయిల్ పంట పండించవచ్చని, పైగా ఆయిల్ పామ్ పంట దేశంలో ఎ పంటకి లేని విధంగా చట్టం ద్వారా, ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా సంబధిత కంపెనీ కొనుగోలు చేస్తారని దొంగల, కోతుల బెడద లేని పంట కాబట్టి రైతులందరూ ముందుకు వచ్చి ఆయిల్ పంట సాగు చేపట్టాలని కోరారు.మెదక్ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు నిమిత్తం రైతులకు మొక్కలు సరాఫరా చేయుటకు వీ/o. లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ వారు చెల్మెడ గ్రామం నిజాంపేట్ మండలంలో 40 ఎకరాల స్థలంలో నర్సరీని స్థాపించడం జరిగిదన్నారు. 9x9 మీటర్ల దూరంలో త్రికోణ ఆకార పద్ధతి (ఆఞఖుఅన్త్రబశ్రీఖుతీ ఎవ్త్రశీం) లో మొక్కలు నాటుకోవడం వలన ఒక్క ఎకరానికి 57 మొక్కలు వచ్చునని, అంతేకాకుండా మొదటి నాలుగు సంవత్సరాలు పంట రాని



దశలో అంతర పంటల ద్వారా కూడా ఆదాయం పొందవచ్చు. ఆయిల్ పామ్ పెట్టిన 5 సంవత్సరాల తర్వాత చాక్లెట్ తయారు చేసే పంట ఐన కోకో పంటను కానీ, వక్క పంటను కానీ నీడని తట్టుకొని పెరిగే పంటల సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చు అని అన్నారు.మెదక్ జిల్లాలో 2023-24 నుండి ఇప్పటి వరకు 1857 ఎకరాల సాగు అవ్వగా ఈ ఈ సంవత్సరం అనగా 2026-27 సంవత్సరానికి మెదక్ జిల్లాకు 2500 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటల సాగు చేయుటకు ప్రణాళికా చేసుకోవడం జరిగినదన్నారు. ఇప్పటివరకు 533 ఎకరాలకి రైతులు సిద్ధం చేసుకోగా, అందులోనుండి 152 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలు పెట్టడం జరిగిందనీ తెలిపారు.

# ములుగులో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ

- సీతక్క ఆదేశాలతో వెనుకబడిన మహిళలకు స్వయం ఉపాధి మార్గం.
- ఫీజు లేకుండా కుట్టుమిషన్ శిక్షణ, సర్టిఫికెట్లతో మహిళల జీవితాల్లో వెలుగు : ములుగులో కాంగ్రెస్ కార్యక్రమం.
- స్వయంగా బ్రతికేలా చేయూత: మదర్ సొసైటీతో కలిసి ములుగులో మహిళలకు ఉచిత శిక్షణ.

ములుగు(ప్రశ్న న్యూస్)మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లాలో వెనుకబడిన మహిళల ఆర్థిక సాధికారత కోసం ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఎవరిపైనా ఆధారపడకుండా, తమ కుటుంబాలను తామే పోషించుకునేలా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

ఈ శిక్షణకు ఎలాంటి ఫీజు వసూలు చేయడం లేదు. శిక్షణ పూర్తయిన అనంతరం మహిళలకు సర్టిఫికెట్లు అందజేసి, వారి జీవితాల్లో ఆనందం నింపేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.రేగ కళ్యాణి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు భాగ్య అక్క, అనిత మల్లురి, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు సుగ్యాల పుష్పావతి శ్రీ మల్లూరు హిమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ సురేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వ్యవస్థాపకురాలు సంధ్య రెడ్డి గారు స్వయంగా పాల్గొన్నారు. ములుగు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మహిళలకు శిక్షణ ఇప్పించి, వారిని స్వయం ఉపాధి పొందేలా చేసే బాధ్యత తమదేనని సంధ్య రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి సీతక్కకి ఇచ్చిన మాట ప్రకారం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లి, మాట నిలబెట్టుకుంటామని ఆమె హామీ



ఇచ్చారు. కుటుంబ పోషణ భారం మహిళలపై పడకుండా, వారికి ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం కల్పించే దూరదృష్టితో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు వెల్లడించారు.

## కాంగ్రెస్ నేత తెడ్డు అశోక్ కుటుంబంలో తీవ్ర విషాదం

- గుండెపోటుతో జెన్ను ముత్యాల ఆకస్మిక మృతి
- కన్నీటి అంతిమ వీడ్కోలు
- పలువురు ప్రజాప్రతినిధుల,నేతల పరామర్శ
- ప్రగాఢ సంతాపం - నివాళులు



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలంలోని ముచ్కూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నేత తెడ్డు అశోక్ అత్తమ్మ జెన్ను ముత్యాల(70) మంగళవారం గుండెపోటుతో అకస్మాత్తుగా కన్నుమూశారు. ఆమె మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బుధవారం బంధుమిత్రులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల సమక్షంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించి అంతిమ కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, గ్రామ పెద్దలు ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఆమె మృతితో ముచ్కూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అంతిమయాత్రలో పాల్గొని తమ నివాళులు అర్పించారు.

# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి

## సీఐటీయూ డిమాండ్

గజ్వేల్ ( ప్రశ్న న్యూస్) గజ్వేల్ ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ (వీబీజీ రామ్‌జీ) చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. అఖిల భారత సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామంలో గ్రామీణ కార్మికులతో కలిసి వీబీజీ రామ్‌జీ చట్టానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బండ్ల స్వామి మాట్లాడుతూ, వామపక్షాల చొరవతో యూపీఏ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌రేగా) స్థానంలో తీసుకొచ్చిన కొత్త చట్టంలో గ్రామీణ కార్మికులకు నష్టం కలిగించే అనేక కఠిన నిబంధనలు చేర్చారని ఆరోపించారు.

గతంలో ఉపాధి హామీ పథకానికి నిధులను ప్రధానంగా కేంద్ర ప్రభుత్వమే భరించేదని, ఇప్పుడు కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం భరించే విధానం వల్ల భవిష్యత్తులో కొన్ని రాష్ట్రాల్లో పథకం అమలుపై అనిశ్చితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. పని దినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచుతున్నామని చెబుతున్నప్పటికీ, అందుకు తగిన నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు. అలాగే, వేతనాల చెల్లింపులో జాప్యం జరిగితే బాధ్యత ఎవరిదనే అంశంపై స్పష్టత లేదని



విమర్శించారు. పని హాజరు నమోదుకు ఫేస్ ఆథెంటికేషన్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు, సాంకేతిక లోపాలు, ముఖ గుర్తింపులో ఇబ్బందుల కారణంగా కార్మికులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దీంతో పని హక్కు కార్మికుడి చేతిలో కాకుండా సాంకేతిక వ్యవస్థ ఆధీనంలోకి వెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వరుసగా 60 రోజుల పాటు పని చేయకపోతే ఉపాధి హక్కును నిలిపివేసే నిబంధన పేద కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. వెంటనే వీబీజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని, లేదంటే గ్రామీణ స్థాయి నుంచి కార్మికులను సమీకరించి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహాలక్ష్మి, కార్మికులు సునీత, మంగవ్వ, పోశవ్వ, లక్ష్మి, పద్మ, నరసవ్వ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ రహదారిపై వినూత్న అవగాహన పోలీసు వాహనాల కటౌట్ల ఏర్పాటు




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ రాజీవ్ రహదారిపై వాహనదారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు పోలీసులు వినూత్న చర్యలు చేపట్టారు.రహదారి పక్కన పోలీసు వాహనాల ఆకృతిలో భారీ కటౌట్లు (ఫోటోలు) ఏర్పాటు చేశారు. దూరం నుంచే పోలీసు వాహనం ఉన్నట్లు కనిపించేలా ఈ కటౌట్లను ఏర్పాటు చేయడంతో, వాహనదారులు అప్రమత్తంగా వేగాన్ని నియంత్రిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.ముఖ్యంగా అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌ను తగ్గించి రోడ్డు ప్రమాదాలను నివారించడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశమని తెలుస్తోంది. రాజీవ్ రహదారిపై ప్రయాణించే వాహనదారులు వేగ పరిమితులు పాటిస్తూ, జాగ్రత్తగా వాహనాలు నడపాలని పోలీసులు సూచిస్తున్నారు.ఈ వినూత్న ప్రయత్నంపై పలువురు వాహనదారులు సానుకూలంగా స్పందిస్తూ, రోడ్డు భద్రతకు ఇలాంటి చర్యలు ఉపయోగపడతాయని అభిప్రాయపడుతున్నారు.

## గంగాధర సబ్ రిజిస్ట్రార్ ఏసీబీ కేసులో ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లు అరెస్ట్..

- రిమాండ్‌కు తరలింపు
- ఫోన్‌పే లావాదేవీలతో బయటపడిన లంచం వ్యవహారం



గంగాధర (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా, గంగాధర ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్ మందా కిరణ్ కుమార్‌కు సంబంధించిన ఏసీబీ కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అక్రమ వసూళ్ల వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్లు బకం అనుదీప్, జక్కుల సాయిలు ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వీరి బ్యాంక్ ఖాతాల ద్వారా ఫోన్‌పే సహా డిజిటల్ లావాదేవీల రూపంలో భారీ మొత్తంలో లంచం సొమ్ము బదిలీ జరిగినట్లు అనిశా అధికారులు ఆధారాలు సేకరించారు. ప్రాథమిక విచారణలో లంచం సొమ్ము లావాదేవీలు ప్రధానంగా వీరి ఖాతాల ద్వారానే జరిగినట్లు తేలింది. అనంతరం ఇద్దరు నిందితులను కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి జైలు రిమాండ్ విధించింది. ఈ అవినీతి వ్యవహారంలో మరికొందరి ప్రమేయంపై కూడా ఏసీబీ అధికారులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించిన గజ్వేల్ జిల్లా ఆసుపత్రి

### "వైద్యుల సేవలు వెలకట్టలేనివి" - డాక్టర్ రేఖారాణి



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేఖారాణి మాట్లాడుతూ, వైద్యులు ప్రజల ప్రాణాలను కాపాడే దైవ స్వరూపులని అన్నారు. "అమ్మ జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మ ఇస్తారు", "వైద్యో నారాయణో హరి" అనే మాటలు వైద్య వృత్తి గొప్పతనాన్ని తెలియజేస్తాయని పేర్కొన్నారు. అపారమైన ఒత్తిడి, భావోద్వేగ సవాళ్లు, నిరంతర శ్రమ మధ్య కూడా వైద్యులు ఓపికగా సేవలందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ జీవితాలను అంకితం చేస్తున్నారని కొనియాడారు. వైద్యులు అవిశ్రాంత కృషి, త్యాగం, అంకితభావంతో సేవలందిస్తూ సమాజానికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. దేశంలో ప్రతి సంవత్సరం ప్రముఖ వైద్యుడు, పశ్చిమ బెంగాల్ రెండో ముఖ్యమంత్రి డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతిని పురస్కరించుకుని జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. వైద్య రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలను, మానవతా దృక్పథాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో సేవలందిస్తున్న వైద్యులను డాక్టర్ రేఖారాణి ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓలు డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ రాకేష్ సింగ్, వైద్యులు డాక్టర్ బిందు, డాక్టర్ మహేశ్వరి, డాక్టర్ సమీక్ష, డాక్టర్ రజిత, డాక్టర్ సాయి శ్రీ, డాక్టర్ ప్రియాంక, నర్సింగ్ సూపరింటెండెంట్లు శివపార్వతి, సువర్ణ, ఉమామహేశ్వరి, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ హెప్సిబా, హెడ్ నర్సులు, నర్సింగ్ అధికారులు, పారామెడికల్, శానిటేషన్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మలయాళం నుంచి మరో హారర్ మూవీ




మలయాళం ఇండస్ట్రీ నుంచి వచ్చే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సినిమాలను .. హారర్ థ్రిల్లర్ సినిమాలను చూడటానికి ఓటీటీ ప్రేక్షకులు ఎక్కువగా ఆసక్తిని చూపుతుంటారు. ఈ తరహా సినిమాలు తెలుగు ఆడియాను కలుపుకుని వస్తే, తెలుగు ఆడియన్స్ కూడా విపరీతంగా చూస్తారు. అలాంటి ఒక సినిమా ఇప్పుడు ఓటీటీ తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఆ సినిమా పేరే 'కరక్కం'. మే 28వ తేదీన అక్కడి థియేటర్లకు వచ్చిన సినిమా ఇది. అంకుశ్ సింగ్ నిర్మించిన ఈ సినిమాకి, సుభాశ్ లలిత – సుబ్రహ్మణ్యం దర్శకత్వం వహించారు. 'మంజుమేల్ బాయ్స్' సినిమాలో లోయలో పడిపోయిన పాత్రను పోషించిన శ్రీనాథ్ భాసి ఈ సినిమాలో ప్రధానమైన పాత్రలో కనిపిస్తాడు. ఫెమీనా జార్జ్ .. సిద్ధార్థ్ భరత్ ఇతర ముఖ్యమైన పాత్రలలో కనిపించనున్నారు. ఈ నెల 3వ తేదీ (శుక్రవారం) నుంచి ఈ సినిమా 'సోనీ లివ్'లో స్ట్రీమింగ్ కానుంది. సామ్ సీఎస్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, మలయాళంతో పాటు తెలుగులోను అందుబాటులోకి రానుంది. కొత్త ఏడాది వేడుకలలో హీరో .. అతని ఫ్రెండ్స్ పీకలదాకా తాగేస్తారు. తాము ఏం చేస్తున్నామనే విషయం కూడా తమకి తెలియని ఒక స్థితిలో ఉంటారు. ఆ సమయంలోనే వాళ్లు ఒక శ్మశానంలోకి వెళతారు. అక్కడి సమాధులను కదిలిస్తారు. ఆ తరువాత అక్కడి నుంచి వెళ్లిపోతారు. దెబ్బతిన్న ఆ సమాధులలో నుంచి ఐదు ప్రేతాత్మలు బయటికి వస్తాయి. వాటి కారణంగా వాళ్లకి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయనేది మిగతా కథ. ఓటీటీ వైపు నుంచి ఈ సినిమాకి ఒక రేంజ్ రెస్పాన్స్ రావడం ఖాయమనే మాటైతే వినిపిస్తోంది మరి.

# హైలెస్సోలో లైలం బాబుగా



సుడిగాలి సుధీర్ ఉరఫ్ సుధీర్ ఆనంద్ కథానాయకుడిగా రూపొందుతున్న గ్రామీణ నేపథ్య యాక్షన్ డ్రామా 'హైలెస్సో'. ప్రసన్నకుమార్ కోట దర్శకుడు. వజ్ర వరాహి పతాకంపై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్న ఈచిత్రంలో ప్రముఖ నటుడు శివాజీ 'లైలం బాబు' అనే పవర్‌ఫుల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం శివాజీ పుట్టిన రోజు సందర్భంగా ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. నల్లటి దుస్తులు, పంచెకట్టుతో రాతి సింహాసనంపై కూర్చొని, చేతిలో సోడా సీసా పట్టుకొని సీరియస్‌గా చూస్తున్న శివాజీని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. శివాజీ ఇందులో అత్యంత పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపిస్తారని, ఆయన పాత్ర సినిమాకే హైలైట్‌గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. నటాషా సింగ్, నక్ష శరణ్ కథానాయికలుగా నటిస్తున్న ఈచిత్రంలో కన్నడ నటి అక్షర గౌడ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సుజాత సిద్ధార్థ్, సంగీతం: అనుదీప్ దేవ్.

# 'ఓజీ-2'లో నాయికగా?



అగ్ర కథానాయిక పూజాహెగ్డే కొంతకాలం పాటు తెలుగు సినిమాకు దూరంగా ఉంది. బాలీవుడ్‌పై దృష్టి పెట్టిన ఈ సొగసరి అక్కడ వరుస ఫ్లాపులు పలకరించడంతో మళ్లీ దక్షిణాది బాట పట్టింది. ప్రస్తుతం తెలుగు, తమిళంలో భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ అమ్మడు తొలిసారి పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్‌తో జోడీ కట్టబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే... బ్లాక్‌బస్టర్ మూవీ 'ఓజీ'కి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. దర్శకుడు సుజీత్ ప్రస్తుతం సినిమా ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు. మరోవైపు కథానాయిక అన్వేషణలో కూడా చిత్రబృందం ఉన్నట్లు తెలిసింది. ఈ రేసులో పూజాహెగ్డే పేరు ప్రముఖంగా వినిపిస్తున్నదని, ఆమెనే ఖరారు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నది ఫిల్మ్‌నగర్ టాక్. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం పూజాహెగ్డే తెలుగులో దుల్కర్ సల్మాన్ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో కూడా ఆమెనే కథానాయికగా ఖరారయ్యే అవకాశాలున్నట్లు సమాచారం.

# రంభ ఊర్వశి మేనక



అల్లరి నరేష్ కథానాయకుడిగా కామెడీ, ఫాంటసీ అంశాల కలబోతగా రూపొందుతున్న తాజా చిత్రానికి 'రంభ ఊర్వశి మేనక' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'కామెడీ గోస్ కాస్మిక్' ఉపశీర్షిక. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. మంగళవారం అల్లరి నరేష్ జన్మదినం సందర్భంగా సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో నరేష్ స్వర్గలోకపు ముంగిట్లో కూర్చొని చేతిలో రంభ, ఊర్వశి, మేనక పేర్లు రాసి ఉన్న పేపర్ పట్టుకొని ఉండగా, పైన మేఘాల్లో అప్సరసలు కనిపిస్తున్నారు. డివైన్ ఎలిమెంట్స్‌తో కూడిన కామెడీ చిత్రమిదని, అల్లరి నరేష్ తనదైన శైలి హాస్యంతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తారని మేకర్స్ తెలిపారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. వెన్నెల కిషోర్, నరేష్ వీకే, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాంరెడ్డి, సంగీతం: చైతన్‌భరద్వాజ్, దర్శకత్వం: చంద్రమోహన్ చింతాడ.

# విభిన్న కథతో హ్యాంగ్‌మెన్




బ్రహ్మాజీ ప్రధానపాత్రలో నటించిన విభిన్న కథాచిత్రం 'హ్యాంగ్‌మెన్'. విహాన్ దర్శకుడు. వి.శ్రీకాంత్ మైసూర్, వీహెచ్ రావు నిర్మాత. ఈ నెల 3న నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు. పద్మశ్రీ డా.బ్రహ్మానందం, నందినీరెడ్డి, అద్దంకి దయాకర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'ఇలాంటి ఓ విభిన్నమైన కథకు కథానాయకుడిగా నన్ను అనుకున్న దర్శకుడు విహాన్‌కి రుణపడి ఉంటాను' అని నటుడు బ్రహ్మాజీ అన్నారు. హార్డ్ హిట్టింగ్‌గా ఉండే సినిమా ఇదని, ఇది ఇప్పటివరకూ రాని కొత్త సబ్జెక్ట్ అని దర్శకుడు విహాన్ తెలిపారు. ఇంకా అజయ్ మైసూర్, ఉదయ్ గుర్రాల, రూపక్, రియల్ హ్యాంగ్‌మెన్ పవన్, సంగీత దర్శకుడు కమ్రాన్, ఎడిటర్ కార్తీక్, శశికిరణ్ కూడా మాట్లాడారు.

## ఊరమాస్ లుక్‌లో 'అయ్యగారు'

# అఖిల్ 'లెనిన్'




అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ డ్రామా 'లెనిన్' మూవీ ట్రైలర్ ఎట్టకేలకు విడుదలై సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. 'ఏజెంట్' వంటి భారీ డిజాస్టర్ తర్వాత అఖిల్ నటిస్తున్న సినిమా కావడంతో దీనిపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి, అందుకు తగ్గట్టుగానే ట్రైలర్ పవర్‌ఫుల్ విజువల్స్‌తో సాగింది. అక్కినేని నాగార్జున గంభీరమైన వాయిస్ ఓవర్‌తో, "ఇది మహాభారతం" అంటూ రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ప్రారంభమయ్యే ఈ ట్రైలర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. గరుడ పురాణం తరహా రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్‌లో అఖిల్ అక్కినేని మునుపెన్నడూ లేని విధంగా ఊర మాస్ లుక్‌లో సరికొత్తగా కనిపించారు. యాక్షన్ ఎపిసోడ్స్, ఎమోషనల్ సీన్స్‌లో అఖిల్ నటన సినిమాపై అంచనాలను పెంచేసింది. ఇందులో అఖిల్ సరసన హీరోయిన్‌గా నటిస్తున్న భాగ్యశ్రీ బోర్సే గ్లామర్, వీరిద్దరి కెమిస్ట్రీ విజువల్స్‌కు మరింత హైలైట్‌గా నిలిచాయి. దీనికి తోడు మ్యూజిక్ డైరెక్టర్ థమన్ అందించిన అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్లింది. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శివాజీ, శరణ్య ప్రదీప్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా

# అమెరికాలో సమంత సెన్సేషన్..

## 'మా ఇంటి బంగారం'తో

## 2026లో అరుదైన రికార్డు!




స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించి, నిర్మించిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. కొంత విరామం తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన సమంత, ఈ సినిమాతో మరోసారి తన స్టార్‌డమ్ ఏమాత్రం తగ్గలేదని నిరూపించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. థియేటర్లలో మంచి ఆదరణతో ప్రదర్శితమవుతున్న ఈ చిత్రం తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశీ మార్కెట్లలోనూ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అమెరికా బాక్సాఫీస్ వద్ద సినిమా నమోదు చేస్తున్న వసూళ్లు సినీ వర్గాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'మా ఇంటి బంగారం' అమెరికాలో రెండో మంగళవారం ఒక్క రోజులోనే 70 వేల డాలర్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో 2026లో విడుదలైన తెలుగు చిత్రాల్లో రెండో మంగళవారం అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచిందని ట్రేడ్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.అయితే ఈ వసూళ్లపై చిత్రబృందం లేదా అధికారిక బాక్సాఫీస్ వర్గాల నుంచి ఇంకా స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. అమెరికా మార్కెట్‌లో స్థిరంగా వసూళ్లు కొనసాగిస్తున్న ఈ చిత్రం, త్వరలోనే 2 మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకునే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒక మహిళా ప్రధాన పాత్రతో తెరకెక్కిన సినిమా ఈ స్థాయిలో వసూళ్లు నమోదు చేయడం విశేషంగా చెప్పబడుతోంది. 'మా ఇంటి బంగారం'తో సమంత మరోసారి తన మార్కెట్ బలాన్ని చాటుకున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కథానాయిక ప్రాధాన్యమున్న కథను ఎంచుకుని ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు, నిర్మాతగా కూడా ఈ సినిమాతో విజయాన్ని అందుకున్నట్లు చెబుతున్నారు. దర్శకురాలు నందిని రెడ్డి రూపొందించిన ఈ చిత్రంలో భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సమంత నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'మా ఇంటి బంగారం', దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ తన జోరు కొనసాగిస్తూ 2026లో టాలీవుడ్‌కు చెందిన విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది.

# నాన్న నాతో అలా ఎప్పుడూ చెప్పలేదు: ఎస్పీ చరణ్!



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం .. తెలుగు పాటకు తేనె వంటి స్వరంతో అభిషేకం చేసిన గాయకుడు. పొలం గట్లపై కన్నెపిల్లలా తెలుగు పాటను పరిగెత్తించిన మధుర గాయకుడు. అలాంటి గాయకుడి తనయుడైన చరణ్ కూడా, గాయకుడిగా తనదైన ముద్రవేస్తూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఆయన పాడిన మెలోడీస్ కొన్ని యూత్ హృదయాలలో మ్రోగుతూనే ఉన్నాయి. అలాంటి చరణ్ తాజాగా 'ప్రేమ ది జర్నలిస్ట్' యూ ట్యూబ్ ఛానల్ కి వచ్చిన ఇంటర్వ్యూలో తన గురించిన అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. " మా చిన్నప్పుడు సింగర్ గా నాన్నగారు చాలా బిజీ. ఉదయం వెళితే ఏ రాత్రికో వచ్చేవారు. ఇండస్ట్రీకి చెందిన ఎంతోమంది గొప్పవాళ్లను ఆయన కలుస్తూ ఉండేవారు. పెద్ద పెద్ద హీరోలతో కలిసి పనిచేస్తూ ఉండేవారు. వాళ్ల ఇళ్లకు మేము వెళుతూ ఉండేవాళ్లం .. వాళ్లు కూడా మా ఇంటికి వస్తుండేవారు. అయితే ఇదంతా మాకు చాలా సహజంగా అనిపించేది.

అందువలన నేను గానీ .. మా సిస్టర్ గాని మేము బాలుగారి పిల్లలమని చెప్పుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. అదో అద్భుతమని కూడా మాకు తెలియదు" అని అన్నారు. " నేను సింగర్ గా పాడవలసి వచ్చినప్పుడు చాలా టెన్షన్ పడ్డాను. ఎందుకంటే బాలుగారి అబ్బాయి అంటే అందరికీ అంచనాలు ఉంటాయి. అందువలన చాలా ఒత్తిడికి గురయ్యేవాడిని. 'నువ్వు బాలుగారి అబ్బాయివి .. ఆ స్థాయిలో పాడాలి మరి' అని నాన్న ఎప్పుడూ కంగారు పెట్టేవారు కాదు. కెరియర్ ను సీరియస్ గా తీసుకుంటే మిగతావన్నీ దార్లో పడిపోతాయని కూల్ గా చెప్పేవారు. అప్పటి కంటే ఇప్పుడు కాస్త బెటర్ గా పాడగలుగుతున్నాను. కాకపోతే అచ్చు నాన్నలా పాడుతున్నానని అందరూ అంటుంటే ఆశ్చర్యంగా అనిపిస్తూ ఉంటుంది" అని చెప్పారు.

# విలేకరులపై అక్రమ కేసుల వేటును సహించేది లేదు.

- తెలంగాణ గడ్డపై ఆంధ్ర పోలీసుల పెత్తనమా.
- తెలంగాణ విలేకరులపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదు
- తెలంగాణలో ఆంధ్ర పోలీసుల - దౌర్జన్యం ఎందుకు?
- ఏ డి జె ఎఫ్, డిజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు
- విజయ్ కుమార్ నారమళ్ళ,ఏనుగు మల్లారెడ్డి





మంథని( ప్రశ్న న్యూస్) తెలంగాణలో విలేకరుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే సహించే ప్రసక్తే లేదని, అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేయడం,ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని రాష్ట్ర అధ్యక్షులు విజయ్ కుమార్ నారమళ్ళ, ఏనుగు మల్లారెడ్డి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.

**- ఆంధ్ర పోలీసుల దౌర్జన్యం ఎందుకు?**

- తెలంగాణ రాష్ట్రం సిద్ధించి దశాబ్దం దాటుతున్నా, ఇంకా ఇక్కడ ఆంధ్ర పోలీసుల పెత్తనం ఏమిటని వారు ప్రశ్నించారు. తెలంగాణ విలేకరులపై ఆంధ్ర పోలీసులు అక్రమ కేసులు బనాయించడం వెనుక ఉన్న కుట్రలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

- "తెలంగాణ ఉద్యమంలో విలేకరులు ప్రాణాలకు తెగించి పోరాడారు. దేశవ్యాప్తంగా ఉద్యమ సెగను చాటిచెప్పింది మేమే. అలాంటి విలేకరులనే నేడు అక్రమ కేసులతో వేధించడం అత్యంత దుర్మార్గం."

- విజయ్ కుమార్ నారమళ్ళ & ఏనుగు మల్లారెడ్డి

- నిజాన్ని నొక్కితే నిప్పులా మారుతుంది!?వార్తల్లో ఏదైనా పొరపాట్లు ఉంటే చట్టపరమైన వివరణ కోరడంలో తప్పులేదు కానీ, ఏ తప్పు చేయని జర్నలిస్టులపై కక్షసాధింపు చర్యలకు దిగడం అన్యాయమని వారు పేర్కొన్నారు. విలేకరుల గురించి వారు చేసిన కీలక వ్యాఖ్యలు:?నిజం నిప్పు లాంటిది: విలేకరుల గొంతు నొక్కినంత మాత్రాన నిజాన్ని దాచలేరు.?ప్రభుత్వానికి హెచ్చరిక: విలేకరులపై దాడులకు, అక్రమ అరెస్టులకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.?ఐక్య పోరాటం: రాష్ట్రంలోని అన్ని జర్నలిస్ట్ సంఘాలను ఏకం చేసి, ఈ అణిచివేతపై పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు.- విలేకరి అంటే సమాజపు కన్ను

- సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపే విలేకరి, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం లాంటివాడు. అక్షరాన్ని ఆయుధంగా మలచుకుని ప్రజల పక్షాన నిలిచే జర్నలిస్టులపై భౌతిక దాడులు, అక్రమ కేసులు పెట్టడం అంటే.. సామాన్య ప్రజల గొంతుకను అణచివేయడమే.

- తక్షణమే విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని ఏడీజేఎఫ్,డీజేఎఫ్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సుధగోని లక్ష్మి కుటుంబానికి బీఆర్ఎస్ నేత
# ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శ



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో ఇటీవల మరణించిన సుధగోని లక్ష్మి కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్ రెడ్డి, బాలయ్య గౌడ్, సతీష్ రెడ్డి, సాయి గౌడ్, అనిల్ రెడ్డి, రాకేష్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో ఎస్. ఐ. ఆర్ సర్వే పరిశీలించిన.
## క్లస్టర్ ఇంచార్జి మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్




మంథని ( ప్రశ్న న్యూస్)బిజెపి చేసే మోసాన్ని రామగిరి మండల ప్రజలు మోసపోవద్దని బి ఎల్ వో, బి ఎల్ ఎ. లు మీ ఇంటి వద్దకు వచ్చి అన్ని విధాలుగా శూన్నంగా పరిచిలించి ఫామ్ నింపి మీ ఓటును కాపాడుకోవాలని కోరుతున్నాము రామగిరి మండలంలో కల్వచర్ల గ్రామంలో ఎస్. ఐ. ఆర్. ఇంటింటి సర్వే కార్యక్రమం ఓటరు వివరాల పరిశీలన, దరఖాస్తుల స్వీకరణలోస్వీకరణలో పాల్గొన్న రామగిరి మండల మాజీ ఎంపీపీ , క్లస్టర్ ఇంచార్జి ఆరేల్లి దేవక్క కొమురయ్య గౌడ్, కల్వచర్ల లొంకకేశరం గ్రామాలను పరిశీలించారు, వారి వెంట మహిళా క్లస్టర్ ఇంచార్జి సౌజన్య - మల్లేష్,లొంకా కాసారం సర్పంచ్ విరాగోని రమాదేవి -శ్రీనివాస్, ఉపసర్పంచ్ రంగు వనిత - రాజబాబు, జిపిఓ తిరుపతమ్మ,మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య,కుంట చక్రవర్తి, కాసారం యూత్ ప్రెసిడెంట్ ఈ. రమేష్ కల్వచర్ల లొంకా కాసారం గ్రామంలో స్పెషల్, ఇన్సెంటివ్, రివిజన్ ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ) కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి బి ఎల్ ఓ. కనకయ్య రజిత, శారదతో వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన దరఖాస్తులను ప్రజలకు అందజేసి నింపించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరి ఓటరు నమోదు, మార్పులు-చేర్పులు, తప్పుల సవరణలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటరు వివరాలు సరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అలాగే కల్వచర్ల పిఎస్ నంబర్. 35, 36, 37, 38,39, లొంకకేశరం పిఎస్. 40 ఇట్టి పిఎస్. లకు మాజీ ఎంపీపీ. ఆరేల్లి దేవక్క కొమురయ్య గౌడ్ క్లస్టర్ గా తన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంటింటి సర్వే ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు.

## రైతు భరోసా నిధులతో రైతుల్లో ఆనందం..
# కాంగ్రెస్ నేతల పాలాభిషేకం

- రైతు సంక్షేమానికి పెద్దపీట.. సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం
- కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం
- కాంగ్రెస్ మండలాధ్యక్షులు : కొమ్మనబోయిన సువీన్ యాదవ్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో రైతు భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.9,000 కోట్ల నిధులను విడుదల చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు,చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సువీన్ యాదవ్ మాట్లాడుతూ, రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. గత పాలనలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని పేర్కొన్నారు. ఒకే విడతలో రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయడం ముఖ్యమంత్రి రైతు పక్షపాత వైఖరికి నిదర్శనమని తెలిపారు. అలాగే చొప్పదండి నియోజకవర్గంలోని రైతులకు ప్రతి పథకం సకాలంలో అందేలా ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్,సర్పంచ్ నల్ల మోహన్, ఏఎంసీ డైరెక్టర్ బాలగోని వెంకటేష్,ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సంబ లక్ష్మీరాజం,రాజ్యలక్ష్మి, రజనీకాంత్, నక్క శ్రీకాంత్, పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి, మైలారం శ్రీనివాసు, గుంటి తిరుపతి, బోయిని మల్లేశం, దూస జనార్దన్, ఒంటెల లక్ష్మారెడ్డి, రైతు సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక రైతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

### మంథని పిఏసీఎస్ పర్సన్ ఇంచార్జి కొత్త శ్రీనివాస్



మంథని ( ప్రశ్న న్యూస్) ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మంథని పిఏసీఎస్ పర్సన్ ఇంచార్జీ కొత్త శ్రీనివాస్ కోరారు. బుధవారం మంథని మండలం పుట్టపాక గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ గ్రామస్తులకు ఎస్ ఐ ఆర్ ఫారాలను అందజేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంథని పిఏసీఎస్ పర్సన్ ఇంచార్జీ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ఎస్ ఐ ఆర్ ఫారాల ద్వారా తమ ఓటు హక్కును తప్పకుండా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. గ్రామంలోని యువతీ యువకులు, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కన్నూరి రాజబాబు. ఉప సర్పంచ్ ఎడ్ల శ్రవణ్ కుమార్, వార్డు సభ్యులు కన్నూరి సుదర్శన్, కన్నూరి వసుంధర సదానందం. బి ఎల్ ఓ కన్నూరి శ్రీలత, కొమ్ము శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు శీలం ప్రభాకర్, ఆకుల సురేష్, మిట్ట కొమురయ్య, కొత్త సతీష్. పాల్గొనడం జరిగింది

## బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి
# ఊర పండుగ ఆహ్వానం - సన్మానం

### - 9 ఏళ్ల అనంతరం నిర్వహించనున్న ఊర పండుగ వేడుకలు



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా,భీంగల్ పట్టణ సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఊర పండుగకు తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని కమిటీ ప్రతినిధులు బుధవారం వేల్పూర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఊర పండుగ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేసి,శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు పతాని కృష్ణ, ఉపాధ్యక్షుడు తీగల రఘు మీడియాతో మాట్లాడుతూ, నవ వసంతాల అనంతరం జూలై 12న నిర్వహించనున్న ఊర పండుగకు ఎమ్మెల్యే హాజరై గ్రామదేవతల ఆశీస్సులు పొందాలని కోరినట్లు తెలిపారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భీంగల్ పట్టణ సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పతాని కృష్ణ, ఉపాధ్యక్షుడు తీగల రఘు, ప్రధాన కార్యదర్శి నిచ్చెమొల్ల రాజేశ్వర్, కోశాధికారి ఎస్.పీ. భూమేశ్వర్, సలహా కమిటీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు నీలం రవి, మల్లెల ప్రసాద్, బొదిరె నర్సయ్య, గున్నాల బాలభగత్, మాజీ కౌన్సిలర్ సతీష్ గౌడ్, బొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నూతన గ్రామపంచాయతీని ఆవిష్కరించి ఎమ్మెల్యే

### యూరియా యాప్ వల్ల రైతన్నలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు
### ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం తెలంగాణ రైతుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తెలిపారు బుధవారం కొల్చారం మండల పరిధిలోని అంసన్పల్లి వసురం తండా లో నూతన గ్రామ పంచయతీని ఆవిష్కరించిన నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా వారు పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు అంశం పల్లి లో 10 లక్షలు వ్యయంతో. పాఠశాల ప్రహరీ గోడ గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం వసురం తండాలో పంచాయతీ భవనం ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు యూరియా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు యాప్ ద్వారా బుక్ చేసుకుందామంటే అందుబాటులో లేకపోవడం పట్ల రైతులు అసహనం వ్యక్తం ఇస్తున్నారని పేర్కొన్నారు రైతులకు ఇబ్బంది కలుగకుండా షాపులో యూరియాను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎన్నికలకు ముందు రైతు రుణమాఫీ పేరిట రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసినా ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు రైతు బీమా సంబంధించి మృతి చెందిన రైతు కుటుంబాలకు ఇప్పటివరకు బీమా డబ్బులు చెల్లించలేదని తెలిపారు రైతు బరోస పేరిట రైతులను మోసం చేయడం జరిగిందన్నారు ప్రభుత్వం ఏర్పడి నుంచి రైతు భరోసా ఆర్బటంగా సమావేశాలు ఏర్పాటు చేసి కొంతమంది రైతులకు మాత్రమే భరోసా నిధులు కడుతున్నాయని తెలిపారు గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి రైతుకు రైతు బంధు డబ్బులు పెట్టుబడి సాయం కింద 11 సార్లు అందించిన ఘనత కేసిఆర్కే దక్కిందని పేర్కొన్నారు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని సూచించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్ ఇంద్రసేనారెడ్డి సంతోష్ శ్రీనివాస్ గౌడ్ రాజా గౌడ్, బాగారెడ్డి సర్పంచ్ పురం మండల అధ్యక్షుడు రవితేజ రెడ్డి వసంతం తాండ గ్రామ సర్పంచ్ వినోద్ నాయక్. గీత తోపాటు అధికారులు పలువురు పాల్గొన్నారు.

## శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి 13 రోజుల్లో
# రూ.66.50 లక్షల హుండీ ఆదాయం



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో గత 13 రోజుల హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారులు బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా హుండీ ద్వారా మొత్తం రూ.66,50,742 నగదు, 36 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 100 గ్రాముల మిశ్రమ వెండి భక్తులు సమర్పించినట్లు వెల్లడించారు.హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ ఈఓ రమాదేవి, కరీంనగర్ ఏసీ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, డీఈఓ భాస్కర శర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, శివరామకృష్ణ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటర్ల జాబితా సవరణకు సమన్వయంతో పనిచేయాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఓలు, బీఎల్ఏల పాత్ర కీలకం
- వేములవాడ ఆర్డీఓ : కె.ఎస్.బి. కుమారి



వేములవాడ ( ప్రశ్న న్యూస్) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, పటిష్ఠంగా నిర్వహించేందుకు బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని వేములవాడ ఆర్డీఓ(రెవెన్యూ డివిజనల్ అధికారి) కె.ఎస్.బి. కుమారి సూచించారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ నకిలీ, డబుల్ ఓట్ల తొలగింపు, మరణించిన, వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపు, అర్హులైన యువతకు కొత్త ఓటరు నమోదు, ఓటర్ల జాబితాలోని తప్పుల సవరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె కోరారు. ఓటు నమోదులో ఇబ్బందులు ఉంటే బీఎల్ఓలను సంప్రదించాలని, వేములవాడ నియోజకవర్గంలోని 262 పోలింగ్ బూతులకు 262 మంది బీఎల్ఓలను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నేతలు పొలాస నరేందర్, మైలారం రాము, పిన్నింటి హన్మాండ్లు, చింతలకోటి రామస్వామి గౌడ్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్లు అబ్దుల్ రహీం, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు ఫైళ్లకే పరిమితం

## ప్రభుత్వ శాఖల్లో పెరుగుతున్న బాధ్యతారాహిత్యం

- అక్రమాలకు అధికారుల అండనా.?
- అధికారుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసహనం
- చర్యల కన్నా సెటిల్మెంట్లకే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు
- అవినీతి ప్రక్షాళన లేకపోతే ప్రభుత్వ పాలనపై నమ్మకం దెబ్బతింటుంది
- అధికారుల తీరుతో విసుగు చెందుతున్న ప్రజలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కట్టడి చేసేనా.?

(ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో)






ప్రభుత్వ అధికారులలో బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం రోజురోజుకూ పెరుగుతోందనే విమర్శలు ప్రజల నుంచి జోరుగా వినిపిస్తున్నాయి. ప్రజలు సమస్యలపై ఫిర్యాదులు చేసినా వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు "చూస్తాం, విచారిస్తాం, చేస్తాం, చర్యలు తీసుకుంటాం" అనే మాటలకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఫిర్యాదులను పరిష్కరించడం కంటే ఫైళ్లలో నానబెట్టడం, కాలయాపన చేయడం, కొన్నిచోట్ల అక్రమాలకు పాల్పడుతున్న వారికి పరోక్షంగా సహకరించడం వంటి ఘటనలు ప్రజల్లో ప్రభుత్వ పాలనపై విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ, ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ, రెవెన్యూ శాఖ, తూనికల కొలతల శాఖ, ఇరిగేషన్ వంటి కీలక విభాగాల్లో అనేక ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండటం, సిబ్బంది, కిందిస్థాయి అధికారులపై చర్యలు లేకపోవడం వల్ల అవినీతి మరింత పెరుగుతోందనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు, అభివృద్ధిలో నాసిరకం పనులు, అధికారులు నిబంధనల ఉల్లంఘనలు, సందర్శన వేళలో అధికారులు అందుబాటులో లేకపోవడం, ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా, కిందిస్థాయి, ఉన్నత అధికారులు వేగంగా స్పందించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, కమిషనర్, జిల్లా ఎస్పీలకు ఫిర్యాదులు చేసిన కూడా ఇలాంటి స్పందన లేకపోవడంతో ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన న్యాయం జరుగుతలేదన్న ఆవేదనలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని సందర్భాల్లో అక్రమాలు జరగక ముందే కొందరు అధికారులు ముడుపులు తీసుకుని వారికి పూర్తిగా సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా తీవ్రంగా ఉన్నాయి అయిన వాళ్లపై ఉన్నత అధికారులు, శాఖల మంత్రులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రెచ్చిపోయి మరింత అవినీతి అక్రమాలకు పాల్పడడం సహజంగా మారింది. ప్రజలు ఎన్ని ఫిర్యాదు చేసినా, పత్రికలలో కథనాలు వచ్చిన కేవలం నోటీసుల పేరుతో కాలయాపన చేసి చివరకు అక్రమాలకు చట్టబద్ధత కల్పిస్తున్నారు అనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటి వ్యవహారాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రతిష్ఠకే మచ్చ తెచ్చేవేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖలలో భారీగా పెరిగిన అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యం, బాధ్యతారహిత్యం..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్న శాఖల్లోనే అవినీతి, నిర్లక్ష్యంపై ఎక్కువగా ఉందన్న ఆరోపణలు రావడం ఆందోళనకరంగా మారిందని ప్రజలు పేర్కొంటున్నారు. ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉన్న శాఖల్లోనే పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే, మిగతా శాఖల పరిస్థితి ఎలా ఉంటుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రజాభవన్లో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కనీస చర్యలు కూడా తీసుకోలేని దుస్థితిలో పాలన జరుగుతోందన్న విమర్శలు రేవంత్ రెడ్డి సర్కారుపై రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ప్రజల ఫిర్యాదులను స్వీకరించడం మాత్రమే కాకుండా వాటిపై నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక వేత్తలు డిమాండ్ చేస్తున్నారు. తప్పు చేసిన అధికారులను బదిలీ చేయడం మాత్రమే కాకుండా, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు, సస్పెండ్ చేయడం, అవసరమైతే అవినీతి నిరోధక సంస్థల ద్వారా విచారణ చేపట్టాలని కోరుతున్నారు. తప్పు చేస్తున్న సిబ్బంది అధికారులపై ఉన్నత అధికారుల చర్యలు లేకపోవడం చూస్తుంటే ఉన్నత అధికారులు ఉంది ఏమి ఉపయోగమన్న విమర్శలు ప్రజల నుండి జోరుగా వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరిపాలనలో ప్రక్షాళన చేపట్టకపోతే ప్రజల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

అవినీతిపై రాజీ లేని వైఖరి, అధికారుల పనితీరుపై నిరంతర సమీక్ష, ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి సమర్థవంతమైన వ్యవస్థ అమలు చేయడం ద్వారా మాత్రమే ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి పొందగలదని మేధావులు సూచిస్తున్నారు. ప్రజలకు జవాబుదారీతనం ఉన్న పాలన అందించాలంటే ఉన్నతాధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం చాలా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఫిర్యాదు చేసిన ప్రతి పౌరుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వ వ్యవస్థలు పనిచేసినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుంది. లేదంటే నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం, అవినీతి అనే మూడు సమస్యలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను మరింత బలహీనపరిచే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. మరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఉన్నత అధికారులు ప్రజల సమస్యలను తీరుస్తారో లేక ప్రజల ఆగ్రహానికి గురవుతారో వేచి చూడాలి.

# పచ్చని సంసారాల్లో అక్రమ సంబంధాల చిచ్చు

- నిమిషాల సుఖం కోసం నమ్ముకున్న వాళ్లను నట్టేట ముంచుడేనా.?
- యువతలో మానవ సంబంధాలపై తగ్గుతున్న ఆప్యాయత
- అక్రమ సంబంధాల మోజులో భర్త, పిల్లలు, అమ్మలను సైతం చంపుతున్న వైనం
- వరుస ఘటనతో పెళ్లంటేనే భయపడుతున్న యువకులు
- కుటుంబ సభ్యుల ఆనందమే నా ఆనందం అనుకుంటే ఆ కుటుంబం నిత్యం సంతోషంతో నిండి ఉంటుంది



**మేడ్చల్ ( ప్రశ్న న్యూస్)** మాయమవుతున్నాడమ్మా మనిషన్నవాడు అంటూ ఓ సినీగేయ రచయిత పాడిన పాటను ప్రస్తుత రోజుల్లో జరుగుతున్న అక్రమ సంబంధాల చిచ్చు అనంతరం జరుగుతున్న పరిణామాలకు అన్వయించుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. క్షణకాలం సుఖం కోసం వెంపర్లాడితే మొత్తం జీవితమే నాశనం చేసుకుంటున్నారు. రాష్ట్ర, దేశవ్యాప్తంగా జరిగిన ఘటనలు ఇందుకు నిదర్శనం. పచ్చని సంసారాల్లో వివాహేతర సంబంధాలు చిచ్చు రేపుతున్నాయి. దీంతో కన్నవారికి సొంత ఊరికి చెడ్డపేరు తీసుకొచ్చి చివరికి కటకటాల్లోకి చేరి ఊచలు లెక్క పెట్టాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. ప్రియుడి మోజులో పడి తమ సంతోషానికి అడ్డు వస్తున్నాడని కన్న తల్లిని, చేసుకున్న భర్తని, కన్న పిల్లలని, తల్లిదండ్రులను కడతేర్చడానికి ఒడిగట్టిన ఘటన చాలా చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నాయి. టీవీ సీరియల్ లు, ఓటీటీలో వచ్చే అడల్ట్ కంటెంట్ ఆలోచనలను పెడదోవ పట్టి స్తున్నాయని అందుకని బి కేర్ ఫుల్ అంటున్నారు పోలీస్ అధికారులు. తమ సంబంధాలకు అడ్డువస్తే సొంత వారినైనా చంపడానికి అస్సలు వెనుకాడం లేదు.

### దిగజారుతున్న కుటుంబ విలువలు..

వివాహేతర సంబంధాల మోజు అక్రమ సంబంధాలతో సొంత వారిని కాటికి పంపుతున్న వైనం ఇటీవల చాలా జరుగుతున్నాయి.

కనికరం లేకుండా వివాహేతర సంబంధాల మోజులో పడి క్షణికానందం కోసం పరితపించి సొంత మనుషులను రక్తం పంచుకొని పుట్టిన బిడ్డలను, కన్న తల్లిదండ్రులను, చేసుకున్న భర్తను సైతం ఎలాంటి కనికరం లేకుండా కడతేర్చుతున్నారు. తమకు కావాల్సింది దక్కితే సరిపోతుంది అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. సొంత మనుషులైన ఇతరులైన మాకేం పట్టదు అన్నట్లు వ్యవహరించి తమ అక్రమ సంబంధాలకు అడ్డువస్తే అడ్డు తొలగించుకుంటున్నారు. చేసిన పాపం పండి కటకటాల పాలవుతున్నారు. ఫలితంగా ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంటుంది ఇక ఆయా ఘటనలో కుటుంబ పెద్ద మరణించిన జైలుకెళ్లిన ఆ కుటుంబం మాత్రం పెద్ద దిక్కు కోల్పోయి రోడ్డు పాలవుతుంది. క్షణీక సుఖం కోసం వెంపర్లాడేవారు ఒక్కక్షణం ఆలోచించుకోవాలి వివాహేతర సంబంధాల జోలికి వెళ్లకుండా తమను తాము నియంత్రించుకోవాలి. జాగ్రత్త పడితే తమను నమ్మిన కుటుంబాలు అండగా ఉండి వారి జీవితాల్లో అనందం పంచవచ్చు. చక్కని భవిష్యత్తు ఇచ్చి వారికి జీవితాంతం అండగా ఉండే అవకాశం ఉంటుంది.

### పచ్చని కాపురాల్లో అక్రమ సంబంధాల చిచ్చు...

భారతదేశం అంటేనె ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, కుటుంబ విలువలకు పెట్టింది పేరు విదేశీయులు సైతం మన దేశానికి విలువనిచ్చే అంశంలో కుటుంబ వ్యవస్థకే మొదటి ప్రాధాన్యం దక్కుతుంది అనడంలో అతిశయోక్తి లేదు. ఇలాంటి దేశంలో మారుతున్న ప్రపంచీకరణ సోషల్ మీడియా ఎఫెక్ట్ అరచేతిలో ఇమిడి పోయే ఫోన్లు, అంతరాయం లేకుండా వచ్చే ఇంటర్నెట్ కారణంగా కుటుంబ, మానవ విలువలు సమాధి చేయబడుతున్నాయి. ఇంటర్నెట్లో వచ్చే వాటిని చూడటం వాటి కోసం వెంపర్లాడటం క్షనికానందంగా మార్చుకున్నారు. నిమిషాల సుఖం

కోసం అక్రమ సంబంధాలు పెట్టుకోవడం అవి బయటపడ్డ నాడు భార్యాభర్తల నడుమ గొడవలు మోసం చేస్తున్నారని ప్రతీకారాలు కుట్ర చేయడం చివరకు కడ తేర్చే వరకు వెళ్లడం వంటి ఘటనలు వెంటవెంటనేజరిగిపోతున్నాయి. క్రమంలో తమను నమ్మిన కుటుంబాలు ఏమైపోతాయని ఒక్క క్షణం కూడా అలోచించడం లేదు. దీంతో కుటుంబ పెద్ద అర్థాంతరంగా కన్నుమూసిన, కటకటాల పాలైన తమను నమ్మిన కుటుంబంలోని పిల్లలు, వృద్దులు అంతా రోడ్డు పాలవుతున్నారు. ఫలితంగా కుటుంబం ఎన్నో ఏళ్ళు ఆర్థిక ఒడిదుడుకులకు గురయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. దీని కారణంగా కుటుంబంలో చిన్నారులు ఉంటే వారి చదువు భవిష్యత్తుపై ఎంతో ప్రభావం చూపుతుంది. పిల్లలు అనాథలుగా మారుతున్నారు.

### దిగజారుస్తున్న కుటుంబ విలువలు..

కొన్ని సందర్భాల్లో కుటుంబ పెద్దను కట్టుకున్న భార్య, భర్తను అంత మోదించిన ఘటనలు ప్రస్తుతం రాష్ట్రంలో చాలా చోటు చేసుకున్నాయి. ఇలాంటి ఘటనల్లో కుటుంబంలో ఉన్న చిన్నారులు అనాథలవుతారని, వృద్ధులు ఎలా బతుకుతారని చిన్నపాటి ఆలోచన వారికి లేదు. జీవితాంతం కుటుంబంతో సాఫీగా సాగి భార్యాపిల్లలు, తల్లిదండ్రులు, బంధువులు ఇలా అందరితో కలిసి మీరు తీసుకున్న కొత్త జీవితం నిర్ణయంతో జీవించి పంచుకునే ఆనందం వెలకట్టలేనిది. కుటుంబ వ్యవస్థకు సగటు మంచి ప్రాధాన్యతనిచ్చి దానికి కట్టుబడి జీవించిన నాడే ఇలాంటి దారుణాలు క్రమేపి తగ్గుముఖం పడతాయి. మన దేశ ఔన్నత్యం మరింత ఇనుమడింపే చేసి కుటుంబ పాలనపై ఉన్న నమ్మకాన్ని నిలబెడుతుంది. ఇలా జరిగిన ప్రతి సంఘటన వెనుక అక్రమ సంబంధాలే ఎక్కువగా ఉన్నాయి.

అయితే కుటుంబ విలువలు దిగజారిపోతూ వివాహేతర సంబంధాల మోజులో పడి పచ్చని సంసారాలు అక్రమ సంబంధాలతో సొంత వారిని కాటికి పంపుతున్న వైనం సమాజంలో అందరినీ కలిచి వేస్తుంది. ఇప్పటికైనా భార్యాభర్తలు, ప్రేమికులు వారి భవిష్యత్తును, కుటుంబంను దృష్టిలో పెట్టుకుని అక్రమ సంబంధాలకు స్వస్తి పలికి మన కుటుంబ సభ్యులతో హాయిగా జీవించాలని కోరుకుందాం.

# ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్

**- హీరో కొత్త సెంటర్‌కు చంద్రబాబు శంకుస్థాపన**



అమరావతి (ప్రశ్న న్యూస్) శ్రీసిటీలోని హీరో మోటోకార్ప్ తయారీ కేంద్రంలో గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0 నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణపై తమ ప్రభుత్వం స్పష్టమైన దార్శనికతను వివరించారు. గతంలో తాము ప్రత్యేక చొరవ చూపి, చర్చలు జరిపి హీరో మోటోకార్ప్ ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. హీరో సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ బ్రిజ్‌మోహన్ లాల్ ముంజాల్‌ను జాతి నిర్మాణానికి సహకరించిన మహనీయుడిగా ముఖ్యమంత్రి కొనియాడారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పవన్ ముంజాల్ పేర్కొన్న విధంగా రూ. 3,200 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆయన కోరారు. భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదేనని, మారుతున్న కాలానికి అనుగుణంగా 'వీడా' బ్రాండ్‌తో హీరో సంస్థ సిద్ధంగా ఉండాలని సూచించారు. తిరుపతి మహిళా పోలీసులకు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను అందించినందుకు సంస్థ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గతంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' గురించి చర్చించేవారమని, అయితే ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో త్వరలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని, ఎల్లుండి కడప స్టీల్ ప్లాంట్ పనులను పునఃప్రారంభించబోతున్నామని ప్రకటించారు. విశాఖపట్నంలో గూగుల్ సంస్థ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోందని వెల్లడిస్తూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సంపద సృష్టిస్తూనే, ఆ ఫలాలను పేదలకు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బ్యాంకు రుణాలను క్రమశిక్షణతో తిరిగి చెల్లిస్తూ, డ్వాక్రా మహిళలు నేడు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతుండటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# బండి భగీరథ్ పోక్సో కేసులో బిగ్ ట్విస్ట్

**- బాధితురాలికి హైకోర్టు నోటీసులు**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తనపై నమోదు చేసిన కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, ఎలాంటి తప్పూ చేయలేదని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని భగీరథ్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. అయితే బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే ముందు బాధితురాలి వాదన కూడా వినాల్సి ఉందని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని బాధితురాలికి నోటీసులు జారీ చేసింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది. మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో బండి భగీరథ్‌పై మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. అనంతరం పరారైన అతణ్ని మే 16న పోలీసులు అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు. ఇంజినీరింగ్ పరీక్షలు రాసేందుకు వీలుగా ఈ నెల 20 నుంచి 24 వరకు మధ్యంతర బెయిల్ మంజూరైంది. గడువు ముగియడంతో గత వారం మళ్లీ చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రస్తుతం రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు ఎల్లుండి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# రాముడి హుండీకే కన్నం

**- కుంభమేళా సమయంలోనే అసలు దోపిడీ!**



అయోధ్య (ప్రశ్న న్యూస్) అయోధ్య రామమందిరం భక్తులు సమర్పించిన విరాళాల్లో భారీ కుంభకోణం వెలుగు చూసింది. 2025 మహా కుంభమేళా సమయంలో భక్తుల రద్దీ, విరాళాలు ప్రవాహాన్ని ఆసరాగా చేసుకుని భారీగా నిధులు పక్కదారి పట్టించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కుంభకోణంలో బావ, బావమరిది అయిన అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా కీలక సూత్రధారులుగా ఉన్నారని, నిధులను దారి మళ్లించడంలో వీరే ప్రధాన పాత్ర పోషించారని పోలీసులు ధృవీకరించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు రూ.79.85 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో జరిగే నగదు లెక్కింపు ప్రక్రియలోని లొసుగులని ఆసరాగా చేసుకుని నిందితులు చేతివాటం ప్రదర్శించారు. సీసీటీవీ కెమెరాల కంటపడకుండా దుప్పట్లలో నగదును దాచి తరలించినట్లు విచారణలో వెల్లడైంది. నిందితులపై నేరపూరిత కుట్ర, నమ్మకద్రోహం వంటి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రధాన నిందితులైన అనుకల్ప్, లవకుశ్ దొంగిలించిన సొమ్ముతో ఫామ్‌హౌస్, రూ.65 లక్షల విలువైన ఇల్లు మరియు పలు ప్లాట్లను కొనుగోలు చేసినట్లు నిర్ధారణ అయింది. అంతేకాకుండా, స్కార్పియో వంటి విలాసవంతమైన కారును కొనుగోలు చేసేందుకు కూడా సిద్ధమయ్యారు. వారి జీవనశైలిలో అకస్మాత్తుగా వచ్చిన మార్పులే పోలీసుల అనుమానాలకు కారణమయ్యాయి. ఈ కుంభకోణం నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేశారు. మరోవైపు, నిందితుల తరఫున వాదించబోమని అయోధ్య న్యాయవాదులు సంఘం ప్రకటించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసుపై లోతైన విచారణ జరుపుతోంది. భక్తులు ఎంతో నమ్మకంతో సమర్పించిన విరాళాల దుర్వినియోగం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588